సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 24 । నవంబర్ । 2023



ఐటీ మాఫీ చేసేవారికే ఓటు

రెండు దశాబ్దాలుగా ఐటీ మాఫీ హామీలకే పరిమితమైందని, ఇకనైనా ఓటు బ్యాంకు రాజకీయాలు మారాలని సింగరేణి కంపెనీ కార్మికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. IIలో▸



ఇటు ఎన్నికల కూత..

ఇటు ఎన్నికల ప్రచారం.. అటు వరికోతలు కొనసాగుతున్నాయి. కూలీలు ప్రచారంలో పాల్గొంటుండడంతో వ్యవసాయ పనుల్లో కొరత ఏర్పడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. IIIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0 /23.0

ఉదయం, రాత్రివేళల్లో చిరుజల్లులతో కూడిన కురిసే అవకాశం ఉంది. తూర్పు దిశగా గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

గూడెంలో భక్తుల సందడి



సత్యనారాయణ వ్రతంలో భక్తులు

దండేపల్లి: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మండలం గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం కార్తీక ఏకాదశి సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి సత్యదేవుణ్ని దర్శించుకున్నారు. 460 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. గూడెం ఆలయ ప్రాంగణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.

ఘనంగా కార్తీక ఏకదశి పూజలు



దీపాలు వెలిగిస్తున్న భక్తురాలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విశిష్టపూజలు చేశారు. ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. ఆకాశదీపంను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ముక్తా రవి, అర్చకులు నరహరి, భద్రాచార్యులు, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

జైపూర్: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థి ఈదా సంజయ్ ఇటీవల సిద్దిపేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అట్యాపట్య సీనియర్ మెన్ కేటగిరీ ఎంపిక పోటీల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బాలభాస్కర్ తెలిపారు. అట్యాపట్య జిల్లా అధ్యక్షుడు కంభగోని సుదర్శన్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్ విద్యార్థి సంజయ్‌ను అభినందించారు. ఈ నెల 26న తమిళనాడు రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, పీఈటీ రాజలింగు అభినందించారు.

బర్రెలక్కపై దాడులను ఖండించాలి



ప్రదర్శనలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

పాతమంచిర్యాల: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే స్వతంత్ర అభ్యర్థి శిరీషా ఉరఫ్ బర్రెలక్కపై దాడులను ప్రజాస్వామికవాదులు ఖండించాలని పౌరసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని రాముని చెరువు కట్టపై రాముని చెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు బర్రెలక్కకు మద్దతుగా సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో నిలబడి ప్రజల గొంతును వినిపించే హక్కు ప్రతీ పౌరునికి ఉందన్నారు. బర్రెలక్కకు పోలీసులు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కుసుకుట్ల మల్లయ్య, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, ట్రేడ్ యూనియన్ నాయకులు కామిశ్ల జయరాజు, అబ్దుల్‌పాషా, కొండపాక ప్రభాకర్, జి.ప్రభాకర్, తిరుపతి, డాక్టర్ గోలిపూర్ణచందర్, ఐలయ్య న్యాయవాది కొట్టె తిరుపతి, సూర్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎంపిక పోటీలు



విజేతలకు పతకాలు అందజేస్తున్న దృశ్యం

చెన్నూర్: చెన్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను పాఠశాల హెచ్ఎం అజీజ్ గురువారం ప్రారంభించారు. హెచ్ఎం అజీజ్ మాట్లాడుతూ అండర్ -14, 17 బాల బాలికల అథ్లెటిక్స్ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు త్వరలో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ ఫణిరాజ్, గురుకృప స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఎం ప్రకాశ్, కార్యదర్శి కారెంగుల రామయ్య, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మారయ్య, మీనారెడ్డి, సిరంగి గోపాల్, దాసరి మల్లేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రచార హోరు !



మంచిర్యాలలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రేంసాగర్‌రావు



మంచిర్యాలలో బీఆర్ఎస్ అభ్యర్థి దివాకర్‌రావు



ప్రచారంలో చెన్నూరు బీజేపీ అభ్యర్థి అశోక్

- జిల్లాలో జోరుగా ఎన్నికల ప్రచారం
- పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ మరింత దూకుడు
- పోటాపోటీగా కార్యక్రమాలు చేపడుతున్న అభ్యర్థులు
- చివరిలో అగ్రనాయకులతో బహిరంగ సభలకు ప్రణాళిక

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. తెల్లవారుజామునే ఇంటి నుంచి ప్రజల్లోకి వెళ్లి రాత్రి పొద్దుపోయే వరకు ఓట్ల వేట సాగిస్తున్నారు. ప్రచారం ముగిసే సమయం పది గంటల వరకు ప్రచారం చేసి అర్ధరాత్రి వరకు మంతనాలు చేస్తున్నారు. అభ్యర్థులందరూ ఇంటింటి ప్రచారానికి వెళ్తూ ప్రతీ ఓటరును పలుకరిస్తూ ముందుకెళ్తున్నారు. తమ పార్టీ గుర్తు, మేనిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. బ్యాలెట్ నమూనా, డమ్మీ ఈవీఎంలతో వృద్ధులు, నిరక్షరాస్యులకు తెలియజేస్తున్నారు. ఇక రోజువారీగా సభలు, సమావేశాలు, కార్నర్ మీటింగ్, రోడ్‌షోలు, బైక్‌ర్యాలీలు, సమ్మేళనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా వర్గాలైన కూలీలు, రైతులు, ఆటో డ్రైవర్లు, సంఘాలు, సింగరేణి కార్మికులతో గేట్‌మీటింగ్, ఉదయం పూట మార్నింగ్‌వాక్‌లతో ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గంలోని మహిళలు, యువత, కుల సంఘాలతో ప్రత్యేకంగా సమావేశమై ప్రచారంలో భాగస్వామ్యం చేస్తున్నారు. ప్రతీ బూత్ స్థాయిలో ఓ ఇన్‌చార్జిని నియమించి గ్రామ, మండల, నియోజకవర్గ, పట్టణ, వార్డుల్లో నిరంతరం ప్రచారం చేయిస్తున్నారు. అభ్యర్థి నేరుగా వెళ్లే ప్రాంతాలతోపాటు తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు, కుటుంబ సభ్యులతో మరోచోట ప్రచారం చేపడుతున్నారు. ఉదయం నుంచే షెడ్యూల్ ఖరారు చేసుకుని ప్రచారంలో ముందుకెళ్తున్నారు. అధికారులతో ముందస్తు అనుమతి తీసుకుని తమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులతోపాటు కుటుంబ సభ్యులు ప్రచారంలో పాల్గొంటున్నారు. తమ భార్యాపిల్లలతోపాటు అన్నదమ్ములు, కుటుంబ సభ్యులు ప్రచారంలో ముందుంటున్నారు.

జంగ్ తెలంగాణ

ఆటాపాటలతో మోత

గ్రామాలు, పట్టణాల్లో ప్రచార రథాలు మోత మోగిస్తున్నాయి. తమకే ఓటేయాలంటూ వాడ వాడల్లో ప్రచారం హోరెత్తిస్తున్నారు. అభ్యర్థులు ప్రచారానికి వెళ్లే సమయంలో ప్రత్యేక ఆకర్షణగా కళాకారులతో ఆటపాటలతో ప్రచారం చేయిస్తున్నారు. అభ్యర్థుల పేర్లు, పార్టీ పరంగా రూపొందించిన పాటలు, ప్రచార రథాలతో ప్రచారం సాగిస్తున్నారు. కళాబృందాలు, ప్రత్యేక నృత్యాలు, పాటలతో అలరిస్తున్నారు. ఇక ప్రత్యేకంగా రూపొందించిన వాహనాల్లో డిజిటల్ తెరలతో ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థి గుణగణాలు, సేవ కార్యక్రమాలు, ప్రత్యర్థిపై విమర్శలు చేస్తున్నారు. వాడ వాడల్లో, కూడళ్లలో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. తమ అభ్యర్థికే ఓటు వేయ్యాలని అభ్యర్థిస్తున్నారు. ప్రధాన పార్టీలతోపాటు స్వతంత్రులు సైతం తమ స్థాయికి మించి ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ప్రచార రథాలను ఏర్పాటు చేసుకుని ప్రచారం చేస్తున్నారు.

చివరి వారంలో మరింత జోరు..

పోలింగ్ సమయం దగ్గరపడుతున్న కొద్దీ అభ్యర్థులు ప్రచార వేగం పెంచుతున్నారు. ఈ నెల 28తో ప్రచారం గడువు ముగియనుండడంతో తక్కువ సమయంలో ఎక్కువ ఓట్లు సాధించేందుకు పట్టణాలపై ఎక్కువగా దృష్టి సారించారు. ఉదయం పూట గ్రామీణ ప్రాంతాల్లో మొదట పూర్తి చేసే పనిలో ఉన్నారు. సమీపంలో ఉన్న ప్రాంతాలు ఎప్పుడైనా వెళ్లొచ్చనే ఆలోచనలతో ఉన్నారు. అంతేకాక చివరి వారం రోజుల్లో అగ్ర నాయకులతో భారీ బహిరంగసభలకు రంగం సిద్ధం చేస్తున్నారు. భారీగా జన సమీకరణ చేసి సభలు విజయవంతం చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీల్లో నియోజ కవర్గాల్లో రాష్ట్ర స్థాయి నాయకులతో ఎన్నికల బహిరంగ సభలు జరిగాయి. మరోసారి చివరిగా బహిరంగ సభలు ఏర్పాటు చేయించాలని అన్ని పార్టీలు ప్రణాళిక వేస్తున్నాయి.

నేడు సీఎం కేసీఆర్ రాక

- నస్పూర్‌లో భారీ బహిరంగ సభ
- బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల ఏర్పాట్లు



సభాస్థలిని పరిశీలిస్తున్న దివాకర్‌రావు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ శుక్రవారం మంచిర్యాలకు రానున్నారు. ఉదయం 11గంటలకు నస్పూర్ పట్టణం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ సమీపంలో జరిగే ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొంటారు. ఈ మేరకు పార్టీ శ్రేణులు భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంచిర్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ భానుప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు, ఆయన తనయుడు విజిత్‌రావు పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. సభ విజయవంతానికి జన సమీకరణ చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజలను సభకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. బీఆర్ఎస్ పార్టీ బలం ప్రదర్శించేలా భారీగా జన సమీకరణ చేసి, ప్రచార సభ విజయవంతానికి కృషి చేస్తున్నారు.

మూడోసారి రాక..

ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ జిల్లా రావడం ఇది మూడోసారి. చెన్నూరు నియోజకవర్గం మందమర్రి బహిరంగ సభ, బెల్లంపల్లి పట్టణంలో స్థానిక ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దుర్గం చిన్నయ్యకు మద్దతు ప్రచార సభల్లో పాల్గొన్నారు. మూడోసారి మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో బహిరంగ సభలో సీఎం పాల్గొననున్నారు. పార్టీ నిర్వహిస్తున్న సభ కోసం సింగరేణి కార్మికులు, సంఘాల నాయకులతోపాటు గ్రామాల నుంచి ప్రజలను తరలించనున్నారు.

సభ ఏర్పాట్ల పరిశీలన

శ్రీరాంపూర్: నస్పూర్ కలెక్టరేట్ సముదాయం సమీపంలోని మైదానంలో ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను గురువారం మంచిర్యాల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి యన్.దివాకర్‌రావు పరిశీలించారు. ఈ సభాస్థలిని, సభకు హాజరయ్యే వారికి కావాల్సిన ఏర్పాట్లపై నేతలతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేశ్, పార్టీ మండల అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, ఉపాధ్యక్షుడు నౌండ్ల సంతోష్‌చారి, కౌన్సిలర్లు వంగ తిరుపతి, నాయకులు డీ.అన్నయ్య, హైమద్, మధు, కాటం రాజు పాల్గొన్నారు.

ఈవీఎంల కమీషనింగ్ పరిశీలన



కమీషనింగ్‌ను పరిశీలిస్తున్న బిశ్వజిత్ దత్తా

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని గురువారం ఈవీఎంల కమీషనింగ్ ప్రక్రియ నిర్వహించారు. బెల్లంపల్లి బజారు ఏరియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో కమీషనింగ్ చేశారు. బెల్లంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్, ప్రధాన రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్ దత్తా బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ల కమీషనింగ్ ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రక్రియ శుక్రవారం సైతం కొనసాగుతుందని తెలిపారు. ఓటింగ్ యంత్రాల పనితీరు, ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి పోలింగ్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడా పొరపాట్లు జరగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మంచిర్యాలలో అదనపు బ్యాలెట్ యూనిట్

- పకడ్బందీగా ఈవీఎంల కమీషనింగ్
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, బి.సంతోష్



ఈవీఎంలను పరిశీలిస్తున్న సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: మంచిర్యాల నియోజకవర్గంలో 17 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున అదనంగా బ్యాలెట్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. శుక్రవారం మంచిర్యాల నియోజకవర్గానికి సంబంధించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో మంచిర్యాల రిటర్నింగ్ అధికారి రాములుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ల కమీషనింగ్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గంలో 227, బెల్లంపల్లిలో 227, మంచిర్యాలలో సహాయ పోలింగ్ కేంద్రాలను కలుపుకొని 289, మొత్తం 743 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడు నియోజకవర్గాల్లో కమీషనింగ్ 23, 24 తేదీల్లో నిర్వహిస్తామని అన్నారు.

నేటి నుంచి హోమ్ ఓటింగ్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల్లో దివ్యాంగులు, 80ఏళ్ల పైబడిన వృద్ధులు ఇంటి నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునేలా శుక్రవారం నుంచి హోం ఓటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, జిల్లాలో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించామని, దివ్యాంగులు, వయోవృద్ధులు, గర్భిణుల కోసం ర్యాంపు, వీల్‌చైర్లు సదుపాయం కల్పించామని తెలిపారు. ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేస్తామని, పోలింగ్ రోజున ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి ఉపయోగించుకుని ఓటు వేయవచ్చని అన్నారు. రాజ్యాంగం దేశ ప్రజలకు కల్పించిన ఓటు హక్కును కచ్చితంగా వినియోగించుకుని సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్..

శుక్రవారం దివ్యాంగులు, వయోవృద్ధులు హోమ్ ఓటింగ్‌తోపాటు అత్యవసర సేవలు అందిస్తున్న, ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది, ఎన్నికల సంఘం జారీ చేసిన పోలింగ్ అథారిటీ పాస్‌లు పొందుతున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి

- మంచిర్యాల కాంగ్రెస్ అభ్యర్థి కే.ప్రేంసాగర్‌రావు
- నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం



న్యాయవాదులతో ప్రేంసాగర్‌రావు



రెబ్బనపల్లిలో అభివాదం చేస్తున్న ప్రేంసాగర్‌రావు

దండేపల్లి/లక్సెట్టిపేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే లక్సెట్టిపేట పట్టణం అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ మంచిర్యాల అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. గురువారం ఆయన దండేపల్లి మండలం రెబ్బనపల్లి, లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధి ఆరో వార్డు మోదెలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవ చేస్తానని, ఇందుకోసం ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ చేతి గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. అధికారంలో లేకున్నా నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తున్న తనను ఆదరించి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అభివృద్ధి జరుగుతుందని, బీఆర్ఎస్ నాయకులు ఎటువంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. మోదెలలో మహిళలకు అభివాదం చేస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. గ్రామంలో నూతనంగా పార్టీలోకి చేరిన కార్యకర్తలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే జిల్లా కోర్టు నిర్మాణం

మంచిర్యాలటౌన్: అధికారంలోకి రాగానే మంచిర్యాల జిల్లా కోర్టుల సముదాయాన్ని ఏర్పాటు చేస్తానని మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మంచిర్యాల జిల్లా కోర్టులో గురువారం బార్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన న్యాయవాదులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి నది ఒడ్డున మాతాశిశు ఆసుపత్రి నిర్మాణం చేపట్టినప్పుడు హైటెక్‌సిటీ కాలనీలోని జనావాసంలో కోర్టు భవనం నిర్మాణానికి ఏమి అడ్డంకి అని, ఎన్ని అవరోధాలు వచ్చినా వాటిని తొలగించి కోర్టు నిర్మాణం చేయిస్తానని హామీనిచ్చారు. తనకు ఒకసారి అవకాశం కల్పించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య, మాజీ అధ్యక్షుడు గడిగొప్పుల మురళీధర్, చుంచు సదానందం, సీనియర్ న్యాయవాది, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సిరిపురం రాజేశ్, కాంగ్రెస పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ చిట్ల రమేశ్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఏంటో చూపిస్తా

శ్రీరాంపూర్: తనకు ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని కే.ప్రేంసాగర్‌రావు అన్నారు. గురువారం నస్పూర్ మున్సిపాలిటీ పరిధి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, జగదాంబ కాలనీ మైదానాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిందని, గత ఎన్నికల్లో ఓడిపోయిన కూడా తమ ట్రస్ట్ నుంచి ప్రజలకు వేసవిలో తాగునీరు, కరోనా సమయంలో పేదలకు సరుకులు అందించామని తెలిపారు. పలువురు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరగా వారికి ప్రేంసాగర్‌రావు కండువా కప్పి స్వాగతం పలికారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్మిళ్ల వేణు, నాయకులు రాచకొండ బొజ్జన్న, కౌన్సిలర్ బొద్దున సంధ్యారాణి, నాయకులు భూపతి శ్రీను, శ్రీపతి మల్లేశ్, ఖాలిద్ పాల్గొన్నారు.

యాసంగి సాగుకు శ్రీకారం

- నారుపోసుకుంటున్న రైతులు
- యాక్షన్ ప్లాన్ రూపొందించని వ్యవసాయ శాఖ
- గోదావరిలో నీటి కొరతతో గట్టెక్కేనా..!



భీమారంలో వరి నారు పోసిన రైతులు

మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలంలో సాగు చేసిన పంటలు ఇప్పటికే దిగుబడి వచ్చిన రైతులు యాసంగి పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. వరి నారుతోపాటు శనగ పంట వేసుకుంటున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ ఇంకా యాసంగి సాగు యాక్షన్ ప్లాన్ రూపొందించకపోవడం గమనార్హం. యాసంగిలో సాగు చేయాల్సిన పంటలు, సాగుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువుల ప్రణాళికతోపాటు రైతులకు సూచనలు చేయాల్సిన అధికారులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉంటున్నారు. వాతావరణం, నీటితడులకు అనుగుణంగా స్వల్పకాలిక, పప్పుదినుసులు, కూరగాయల పంటల సాగుపై ప్రోత్సాహం లేకపోవడంతో రైతులు ఏటా వేసిన పంటలు వేస్తున్నారు. ఇప్పటికే ధాన్యం దిగబడి వచ్చిన రైతులు మళ్లీ వరి నారు పోసుకుంటున్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు పిల్లర్లు పగుళ్లు రావడంతో ప్రమాద హెచ్చరికలతో అన్నారం, సుందిళ్ల గేట్లు ఎత్తి నీటిని బయటకు దిగువ ప్రాంతాలకు వదిలారు. దీంతో గోదావరి నీటి నిల్వ లేకుండా పోయింది. గత మూడేళ్లగా నిల్వ నీటితో మోటార్ల సహాయంతో పెద్ద ఎత్తున వరి సాగు అవుతోంది. ప్రస్తుతం వరి సాగు చేసుకునే రైతులు నీటితడులకు ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడనుంది. వరి సాగుకు బదులు ఇతర సాగు చేసుకునే విధంగా రైతులకు సూచనాలు అందించాల్సిన వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే కొన్ని చోట్ల వరికోతలు పూర్తి కాగా మరికొన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు లేక పంట దిగుబడి వచ్చి హార్వేస్టింగ్ ఆలస్యం చేస్తున్నారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే దిగుబడి వచ్చిన ధాన్యం అమ్ముకొని యాసంగి సాగు చేయాల్సి ఉండగా ధాన్యం సేకరణ ఆలస్యం కారణంగా ఆలస్యమవుతోంది.

సింగరేణి భవిష్యత్‌ను కాపాడుకోవాలి

- మంచిర్యాల బీఆర్ఎస్ అభ్యర్థి ఎన్.దివాకర్‌రావు
- నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం



మాట్లాడుతున్న దివాకర్ రావు

శ్రీరాంపూర్: సింగరేణి భవిష్యత్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులపై ఉందని మంచిర్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు అన్నారు. గురువారం ఆర్కే 5బీ గనిపై కార్మికులను కలిసి ఓట్లు అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కార్ కాకుండా మరే ప్రభుత్వం వచ్చినా సింగరేణిని నాశనం చేస్తారని ఆరోపించారు. కేసీఆర్‌తోనే సింగరేణి కార్మికులకు అనేక హక్కులు, సదుపాయాలు వచ్చాయని, గతంలో జాతీయ సంఘాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను కూడా తిరిగి ఇప్పించారని తెలిపారు. కార్మికులకు ప్రధాన సమస్య ఐటీపై కూడా ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ మందమర్రి సభలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే పెర్క్స్‌పై ఆదాయపన్ను మాఫీ చేస్తుందని అన్నారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ.వెంకట్రావు, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు డీ.అన్నయ్య, మంద మల్లారెడ్డి, కేంద్ర చర్చల ప్రతినిధులు ఏనుగు రవీందర్ రెడ్డి, జీఎం కమిటీ సభ్యులు వెంగళకుమారస్వామి, కాశీరావు, నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, తొంగల రమేష్, శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సర్పంచ్ దంపతుల చేరిక

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం టీకానపల్లి గ్రామంలో గురువారం నడిపెల్లి దివాకర్‌రావు విస్తృత ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. టీకానపల్లి గ్రామ సర్పంచ్ రాంటెంకి మల్లేశ్వరి, ఆమె భర్త దుర్గయ్య ఇటీవల బీజేపీలో చేరగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే దివాకర్‌రావు సమక్షంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం మద్దతు

శ్రీరాంపూర్: ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటిస్తున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా పద్మశాలి కుల సంఘం నాయకులు తెలిపారు. గురువారం ఆర్కే 6 గాంధీనగర్‌లోని ఆ కుల సంఘం కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశానికి దివాకర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కుల సంఘం నాయకులు ఆయనకు మద్దతు ప్రకటిస్తూ తీర్మానం చేశారు. నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, కుల సంఘం అధ్యక్షుడు జక్కెన రాజేందర్, ప్రధాన కార్యదర్శి కొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కుంట రామన్న, కోశాధికారి విద్యాసాగర్, నాయకులు మొండయ్య, సదానందం పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే ప్రజలకు మేలు..



దండేపల్లి: ఓటు అభ్యర్థిస్తున్న దివాకర్‌రావు

దండేపల్లి: బీఆర్ఎస్ హయాంలోనే ప్రజలకు మేలు చేకూరిందని దివాకర్‌రావు అన్నారు. మండలంలోని కన్నెపల్లి, గూడెం గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని కొర్విచెల్మకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి నడిపెల్లి ట్రస్టు చైర్మన్, ఎమ్మెల్యే తనయుడు విజిత్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డీసీఎమ్మెఎస్ చైర్మన్ తిప్పని లింగన్న, మాజీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పదంగా వివాహిత మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ

లక్సెట్టిపేట(మంచిర్యాల): అనుమానాస్పదంగా యువతి మృతి చెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని మోదెలలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్‌కు చెందిన స్వప్న (23)కు మోదెల గ్రామానికి చెందిన శ్రీధర్‌తో ఫోన్‌లో పరిచయమైంది. అదికాస్తా ప్రేమగా మారడంతో రెండేళ్లక్రితం వివాహం చేసుకున్నారు. దంపతులకు ఒక పాప జన్మించింది. ఈ నెల 22న స్వప్న తన తల్లి, బాబాయికి ఫోన్ చేసి భర్త, కుటుంబ సభ్యులు కట్నం డబ్బులు కావాలని వేధిస్తున్నారని చెప్పింది. కొద్ది సేపటి తరువాత శ్రీధర్ మృతురాలి తల్లి మంగమ్మకు ఫోన్ చేసి మీ కూతురు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు రోదిస్తూ మోదెలకు వచ్చారు. తమ కూతురిది ఆత్మహత్య కాదని హత్యగా అనుమానం ఉందని, భర్త, అత్తమామలపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


సంఘటన స్థలంలో క్షతగాత్రులు

లక్సెట్టిపేట(మంచిర్యాల): మున్సిపాలిటీ పరిధిలోని బీట్‌బజార్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రాజేశ్, లక్సెట్టిపేటకు చెందిన శుషాంత్, మంచిర్యాలకు చెందిన సంతోశ్ ద్విచక్ర వాహనంపై స్థానిక బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌక్‌వైపు వెళ్తుండగా బీట్‌బజార్ వద్దకు వెళ్లగానే ఆగి ఉన్న కారును ఢీకొన్నారు. బైక్ అదుపుతప్పి కిందపడడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం తాండూర్ మండలంలోని నర్సాపూర్‌కు చెందిన టేకం అజయ్(35) భార్య కొంతకాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో తిర్యాణి మండలం చోపిడికి చెందిన వితంతువు ఆత్రం పోచుబాయిని రెండో వివాహం చేసుకున్నాడు. చోపిడిలోనే నివాసం ఉంటూ కైరిగూడ ఓసీపీలో లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాల కారణంగా నెల రోజుల క్రితం దంపతులిద్దరూ ఆత్మహత్యకు యత్నించారు. ఈ క్రమంలో ఈ నెల 18న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అజయ్ తిరిగి రాలేదు. గురువారం ఉదయం రెబ్బెన మండలం సోనాపూర్ గ్రామ సమీపంలో మృతదేహం లభ్యమైంది. మూడు రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అభిప్రాయపడ్డారు. మృతుని సోదరుడు మారు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐటీ మాఫీ చేసేవారికే ఓటు!


ఆర్కే 6 గనిపై విధులకు హాజరైన కార్మికులు

కార్మికుల ఎజెండా

- రెండు దశాబ్దాలుగా హామీలకే పరిమితం
- ఓటు బ్యాంకు రాజకీయాలు మారాలి
- సింగరేణిని రక్షించే ప్రభుత్వం రావాలి
- సింగరేణి కార్మికుల డిమాండ్

శ్రీరాంపూర్(మంచిర్యాల): ప్రాణాలు పణంగా పెట్టి బొగ్గు గనుల్లో పనిచేస్తున్నాం. గనిలోకి దిగిన తర్వాత బయటికి ఎలా వస్తామో కూడా తెలియదు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో దేశానికి వెలుగులివ్వడం కోసం కష్టపడి పనిచేస్తున్న మాకు ప్రభుత్వాలు ఎన్ని చేసినా తక్కువే.. అని సింగరేణి కార్మికులు పేర్కొంటున్నారు. తెలంగాణలో అతిపెద్ద ప్రభుత్వ రంగ పరిశ్రమ అయిన సింగరేణి 6 జిల్లాలో విస్తరించి ఉంది. 18 ఓసీపీలు, 24 భూగర్భగనులు ఉన్నాయి. 43 వేల మంది పైచిలుకు కార్మికులు పని చేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోతో కార్మికుల ముందుకు వస్తున్నాయి. సింగరేణి విస్తరించిన ఆయా జిల్లాల్లోని సుమారు 11 నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపోటములను సింగరేణి ఓటర్లు ప్రభావితం చేస్తారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, కాంట్రాక్ట్ కార్మికులు ఇలా సింగరేణిపై ఆధారపడి బతుకుతున్న వారు సుమారు 3.5 లక్షల ఓటర్లు ఉన్నారు. వీరిలో కార్మికులు తమ ప్రధాన డిమాండ్లపై రాజకీయ పార్టీలు ఈ ఎన్నికల్లో స్పష్టమైన హామీ ఇస్తేనే వారికి ఓటు వేస్తామని కార్మికులు పేర్కొంటున్నారు. ప్రధానంగా ఆదాయపు పన్ను మాఫీ డిమాండ్ ప్రధానంగా ఉంది. దీంతో పాటు ఇతర డిమాండ్లను కార్మికులు పార్టీల అభ్యర్థుల ముందుంచి పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే 6 గనిపై పలువురు కార్మికులను 'సాక్షి' పలుకరించగా వారు తమ అభిప్రాయాలను ఈ విధంగా పంచుకున్నారు.

సొంతింటి పథకం అమలు చేయాలి



సింగరేణిలో పనిచేసే కార్మికులు వచ్చే జీతాలతో స్థలం కొని ఇల్లు కట్టుకోవడం ఈ ప్రాంతంలో కష్టంగా ఉంది. సింగరేణి వద్ద చాలా స్థలాలు ఖాళీగా ఉన్నాయి. కంపెనీకి ఉపయోగపడని స్థలాలను గుర్తించి సొంతింటి పథకం ప్రవేశపెట్టి ప్రతీ కార్మికునికి రెండు గుంటల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.20 లక్షల రుణం ఇవ్వాలి. ఇవి నెరవేర్చిన వారికి కార్మికుల మద్దతు ఎప్పుడూ ఉంటుంది.

– కే.శ్రీధర్‌రెడ్డి, జనరల్ మజ్దూర్

సింగరేణి నిధులు ఇక్కడే వెచ్చించాలి



సింగరేణికి సంబంధించిన సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ నిధులను సింగరేణి ప్రాంతాల్లోనే ఖర్చు చేయాలి. సింగరేణి నిధుల దుర్వినియోగం అరికట్టే పార్టీలు ప్రభుత్వంలో ఉండాలి. ఈ నిధులతో కాలనీల్లో సదుపాయాలు పెంచాలి. సింగరేణి క్వార్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొత్త క్వార్టర్ల నిర్మాణం చేపట్టాలి. ప్యూరిఫైడ్ నీటిని సరఫరా చేయాలి. కాలనీలను సుందరీకరించాలి.

– కే.సందీప్, జనరల్ మజ్దూర్

ఆదాయపుపన్ను మాఫీ చేస్తేనే..



11వ వేతన ఒప్పందంలో వేతనాలు పెరగడంతో అంతా ఐటీ స్లాబ్‌లోకి వచ్చాం. దీంతో ఎంత వేతనం పెరిగినా వచ్చే ఆదాయంలో సగం ఇన్‌కం ట్యాక్స్‌కే పోతోంది. ఆదాయపు పన్ను మాఫీ చేయాలని పదేళ్లుగా డిమాండ్ చేస్తున్నాం. ప్రతీ ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నేతలు గనులపైకి వచ్చి తాము గెలిస్తే ఇన్‌కం ట్యాక్స్ మాఫీ చేస్తామని హామీ ఇచ్చి తీరా గెలిచిన తర్వాత విస్మరిస్తున్నారు. ఈ సారి ఎవరైతే కచ్చితమైన హామీ ఇస్తారో వారికే ఓటేస్తాం. ఈ సారి మోసం చేస్తే సహించేది లేదు.

– దుంటి అనిల్, జనరల్ మజ్దూర్

మేనిఫెస్టోలో సింగరేణి డిమాండ్లు చేర్చాలి



రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో సింగరేణి డిమాండ్లను చేర్చాలి. అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగనులు ప్రారంభించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇవ్వాలి. డిపెండెంట్ల వయస్సు అర్హతను 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచాలి. అప్పుడే చాలా మంది డిపెండెంట్లు కారుణ్య ఉద్యోగాలు పొందగలుగుతారు. దీంతో పాటు మారు పేర్లతో పనిచేసే వారి అసలు పేర్లను క్రమబద్ధీకరించాలనే హామీ నెరవేర్చాలి. ఈ రెండు తీర్చగలిగే వారికే ఓటేస్తాం.

– అబ్దుల్ యాకుబ్, జనరల్ మజ్దూర్

ఓటును అమ్ముకోవద్దు



సింగరేణి కార్మికులు నోటు కోసం ఓటును అమ్ముకోవద్దు. అలా చేస్తే మనం ఎన్నుకున్న వారిని పనులు చేయాలని నిలదీసే అర్హత కోల్పోతాం. గెలిచిన నేతల అవినీతిని ప్రశ్నించే నైతికత కోల్పోతాం. అభ్యర్థి గుణగణాలను, పార్టీల మేనిఫెస్టోలను చూసి ఓటేస్తా. సింగరేణి కార్మికుల సమస్యలపై అవగాహన ఉన్నవారికే ఓటేస్తాం.

– ఎం. రాజ్‌కుమార్, లైన్‌మెన్

అభివృద్ధిని కాంక్షించే వారికే..



సింగరేణి అభివృద్ధిని కాంక్షించే వారికే ఓటు వేస్తా. మా సంస్థ అభివృద్ధి, మా బాగోగులు చూసే వారినే ఎన్నికల్లో గెలిపిస్తాం. అధికారంలోకి వచ్చిన తరువాత సింగరేణిని ప్రైవేటుపరం కాకుండా చూడాలి. పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్యను పెంచుతామనే నమ్మకం కార్మికుల్లో కల్పించాలి.

– టీ. ప్రకాశ్‌కుమార్, ఓవర్‌మెన్

ఐఎన్‌టీయూసీ ఏరియా సెక్రటరీగా మనోజ్


కారుకూరి మనోజ్

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా సెక్రటరీగా కారుకూరి మనోజ్ నియామకమయ్యారు. గురువారం ఆయా యూనియన్ కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో నగేశ్ నియామకాన్ని యూనియన్ సెక్రటరీ జనరల్ బీ.జనక్ ప్రసాద్ ప్రకటించారు. మనోజ్ ఎస్సార్పీ 3, 3ఏ గనిలో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్నాడు. తనకు ఈ పదవి అప్పగించిన యూనియన్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపాడు.

'నేతకానీలకు న్యాయం చేయని చిన్నయ్య'

బెల్లంపల్లి: నేతకాని కులస్తులకు ఏమాత్రం న్యాయం చేయని బెల్లంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్యను ఓడిస్తామని నేతకాని మహార్ హక్కుల సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ దుర్గం గోపాల్ అన్నారు. గురువారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా సొంత కులస్తులకు ఎలాంటి మేలు చేయకపోగా అగ్రకులాల పంచన చేరారని విమర్శించారు. రామగుండం, మంచిర్యాల, జైపూర్, జన్నారం ప్రాంతాలకు చెందిన తన బంధువులను బెల్లంపల్లికి పిలిపించి తప్పుడు ప్రకటనలు చేయిస్తున్నారని, అసత్య ప్రచారంతో నేతకానిలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 26న నిర్వహించే నేతకాని సింహగర్జన సభను నేతకానిల నయవంచన సభగా అభివర్ణించారు. ఈ సమావేశంలో నేతకాని యూత్ రాష్ట్ర అధ్యక్షుడు గోమాస శ్రీకాంత్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు, ఎంపీటీసీ ఎం.మహేందర్, నాయకులు బానయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల నంబర్ స్విచ్‌ఆఫ్!

- కొనుగోలు కేంద్రాల్లో రైతుల ఇబ్బందులు
- నిరుపయోగంగా కంట్రోల్ రూం
- ఆరు రోజులుగా ఒక్క ఫిర్యాదు స్వీకరించని వైనం



కంట్రోల్ రూమ్, కాల్ సెంటర్ ప్రారంభించిన అదనపు కలెక్టర్ మోతిలాల్ (ఫైల్)

మంచిర్యాలఅగ్రికల్చర్: 'మబ్బులు పడుతున్నాయ్.. టార్పాలిన్లు కావాలి.. సెంటర్ ఎప్పుడు ఓపెన్ చేస్తారు.. గన్నీ సంచులు ఎప్పుడు వస్తాయి.. ధాన్యం కాంటా ఎప్పుడు పెడ్తారు?..' ఇలా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఎదుర్కొంటున్న రైతుల్లో అనేక సందేహాలు ఉన్నాయి. గురువారం ఆకాశం మబ్బులు పట్టి ఉండటంతో ఆందోళనలో ఉన్న అన్నదాతలు సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు కంట్రోల్ రూం నంబర్ 63039 28682కు ప్రయత్నిస్తుండగా, ఆ నంబర్ స్విచ్‌ఆఫ్ వస్తోంది. దీంతో పనిచేయని నంబర్ ఎందుకంటూ అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

15 నుంచి కొనుగోళ్లు..

జిల్లాలో ఈ నెల 15 నుంచి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. 18న జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ పౌరసరఫరాల శాఖ, ధాన్యం సేకరణ ఏజెన్సీలు, ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు, మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి ధాన్యం సేకరణలో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు మండలాల వారీగా ప్రత్యేకాధికారులను నియమించారు. సెంటర్లలో ఇబ్బందులపై ఫిర్యాదు చేసేందుకు పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్, కాల్ సెంటర్ ప్రారంభించారు. ఫిర్యాదులను రిజిస్టర్‌లో నమోదు చేసి సంబంధిత అధికారులకు సమాచారం అందించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. కానీ ఆరు రోజులుగా ఇప్పటి వరకు ఒక్క ఫిర్యాదు స్వీకరించకపోవడం.. సెల్‌నంబర్ స్విచ్ ఆఫ్ వస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి.

ఎప్పుడు చేసినా స్విచ్‌ఆఫ్



నాలుగెకరాల్లో వరి సాగు చేసిన. కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోసి వారం అవుతోంది. నిన్నటి నుంచి మబ్బులు కమ్ముకుంటున్నాయి. వర్షం కురిస్తే ధాన్యం తడిసిపోతుందని భయంగా ఉంది. సెంటర్ ఓపెన్ చేస్తలేరు. కనీసం కవర్లు అయినా ఇవ్వాలని నిన్నటి నుంచి కంట్రోల్ రూంకు ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ అని వస్తోంది.

– తాని రాజు, కుందారం, మం.జైపూర్

పనిచేయని నంబర్ ఎందుకిచ్చిండ్రు..?

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూం 63039 28682 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని పేపర్లో ఇచ్చిండ్రు. కాంటా పెట్టిన బస్తాలు మిల్లుకు తరలించాలని ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ వస్తోంది. పనిచేయని ఫోన్ నంబర్ పేపర్లో ఎందుకు ఇచ్చిండో.. ఏమో..

– ఆర్.లక్ష్మణ్, పెద్దపేట్, మం.హాజీపూర్

మాకేదీ ఓటు హక్కు..?

- ఎన్నికల విధుల్లో ప్రైవేటు బస్సు డ్రైవర్లు
- ఓటును వినియోగించుకోలేని పరిస్థితి
- ఆందోళన వ్యక్తం చేస్తున్న డ్రైవర్లు
- ప్రత్యామ్నాయం కల్పించాలని వేడుకోలు

చింతలమానెపల్లి(సిర్పూర్): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైంది. ఎన్నికల్లో ఓటు వేసి మనకు నచ్చిన వ్యక్తిని ఎన్నుకునే హక్కు రాజ్యాంగం మనకు కల్పించింది. కానీ ఎన్నికల విధుల్లో ఉండే ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించే క్రమంలో ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్లు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోలేకపోతున్నారు. దీంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలకు సుమారు 300 పైగా బస్సులు ఉండగా డ్రైవర్లు, సిబ్బంది కలిపి 400కు పైగా ఉన్నారు.

ఎన్నికల విధులకు ప్రైవేటు బస్సు డ్రైవర్లు

ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల నిర్వహణ సంఘం సిబ్బందిని తరలిస్తుంది. ఇందుకు అందుబాటులో ఉన్న ప్రయాణికుల వాహనాలను వినియోగిస్తారు. ఈ క్రమంలో ఆసిఫాబాద్, సిర్పూర్(టి) నియోజకవర్గాల్లోని ప్రైవేటు పాఠశాలలు, ఇతర సంస్థలు, ప్రైవేటు బస్సులను ఎన్నికల విధులకు వినియోగిస్తుంటారు. వీటి ద్వారా సిబ్బందిని వారికి కేటాయించిన స్థలాలకు చేరవేస్తుంటారు.

ఓటు హక్కు వినియోగించుకోలేని పరిస్థితి

ప్రతీ ఎన్నికల్లో ఎన్నికల నిర్వహణకు ప్రైవేటు బస్సులను వినియోగిస్తుండగా వాటితో పాటు డ్రైవర్లు ఓటుహక్కు కలిగిన ప్రాంతాల నుంచి ఇతర దూర ప్రాంతాలకు వెళ్యాల్సి వస్తోంది. ఈక్రమంలో వారు తమ ఓటు హక్కును వినియోగించుకోలేని పరిస్థితి. దీంతో నిరాశకు గురవుతున్నారు.

ప్రత్యామ్నాయం కల్పించాలి

ఎన్నికల నిర్వహణ విధుల్లో భాగంగా దూర ప్రాంతాలకు వెళ్లే ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకునే అవకాశం ఉంటుంది. దివ్యాంగులు, వ్యక్తిగత, అనారోగ్య కారణాలతో బాధపడుతున్నవారు ఓటు హక్కును ఇతరుల ద్వారా వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. కానీ అనధికారికంగా ఎన్నికల విధులకు హాజరవుతున్న ప్రైవేటు పాఠశాలల, ప్రైవేటు బస్సు డ్రైవర్లకు మాత్రం ఓటు హక్కు వినియోగించుకోలేని పరిస్థితి. తమకు సైతం ఓటు హక్కు వినియోగించేకునేలా ప్రత్యామ్నాయం కల్పించాలని ఇటీవల కౌటాల తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

గత ఎన్నికల్లోనూ వినియోగించుకోలేదు



చింతలమానెపల్లి మండలం బాబాసాగర్ గ్రామానికి చెందిన నాకు గత అసెంబ్లీ ఎన్నికల్లో బెజ్జూర్ మండలంలోని నాగెపెల్లి గ్రామానికి పంపించారు. బస్సులో సిబ్బందిని తరలించారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికలు, అనంతరం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం నేను ఓటు హక్కు వినియోగించుకోలేక పోయాను.

– బస్కిత్రి తిరుపతి, చింతలమానెపల్లి

ఓటు హక్కు వచ్చి ఏంలాభం?



ప్రతి ఎన్నికల్లో మేము ఎన్నికల విధుల నిర్వహణకు సహకరిస్తున్నాం. మాకు ఓటు హక్కు ఉన్న గ్రామంలో కాకుండా ఇతర ప్రాంతాలకు సిబ్బందిని తీసుకుని వెళ్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో మేము ఓటు హక్కు వినియోగించుకోలేక పోతున్నాం. ఓటు హక్కు ఉన్నా లాభం లేకుండా పోతోంది.

– ఎస్‌కె రఫీక్, బాబాసాగర్

అసంతృప్తి ఉంటోంది



ప్రజాస్వామ్యంలో కీలకంగా ఉన్న ఓటు హక్కును ఎన్నికల్లో వినియోగించుకోలేక పోతున్నాం. ఎన్నికల విధులను నిర్వహిస్తున్నప్పటికీ ఓటు వేయలేదనే అసంతృప్తి ఉంటోంది. ప్రభుత్వం ఇచ్చిన ఓటు హక్కును వినియోగించుకోలేని పరిస్థితి.

– రావుల సాయినాథ్, కౌటాల

ప్రత్యామ్నాయం కల్పించాలి



మా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు సహకరించాలి. ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించాలి. ఇతర ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటుహక్కు వినియోగించుకున్నట్లు మాకు సైతం ప్రభుత్వం ఓటును వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రాంటెంకి ప్రశాంత్, గురుడుపేట

పాలకులారా.. మీదయ చూపరయా!

- ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


అలంకార ప్రాయంగా మ్యాంగో మార్కెట్

బెల్లంపల్లి: పాలకుల హామీల వర్షంలో ప్రతి ఐదేళ్లకోసారి తడిసి ముద్దవుతున్న ప్రజలు ఏళ్లు గడుస్తున్నా సమస్యలు పరిష్కారం కాక నిరాశచెందుతున్నారు. నేతల వాగ్దానాలకు సంబరపడి పోవడం తప్పా ప్రజలకు మరే ప్రయోజనం ఉండడం లేదు. విద్య, వైద్యం, తాగు, సాగునీరు, ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో దుర్భర పరిస్థితులు చవిచూస్తున్నారు.

పేరుకే వందపడకల ఆసుపత్రి

బెల్లంపల్లి కేంద్రంగా దశాబ్దాల క్రితం 30 పడకల వైద్య విధాన పరిషత్ సామాజిక కమ్యూనిటీ ఆస్పత్రి ఏర్పాటు చేశారు. మూడేళ్ల క్రితం 100 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. కానీ తగినంత మంది వైద్యులు, సిబ్బందిని నియమించలేదు. ఆస్పత్రిలో ప్రతినెల 60కి పైగా ప్రసవాలు జరుగుతుండగా సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మ్యాంగో మార్కెట్‌లో అమ్మకాలు, కొనుగోళ్లు లేవ్

జిల్లాలోని 18 వేల హెక్టార్లలో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. బెల్లంపల్లి కేంద్రంగా 2015లో రూ.1.26 కోట్ల అంచనాతో మ్యాంగో మార్కెట్ మంజూరు కాగా 2017లో నిర్మాణం పూర్తయింది. కానీ ఇప్పటి వరకూ క్రయవిక్రయాలు జరగలేదు. ట్రేడర్స్ ముందుకు రాకపోవడం, రైతులకు సరైన అవగాహన కల్పించకపోడవంతో మార్కెట్ ఉన్నా ఉపయోగం లేకుండా పోతోంది.

ఐదు మండలాలకు కళాశాలలేవి?

మండలానికో ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేస్తామన్న పాలకుల హామీలు నీటి మూటలుగా మారాయి. ప్రస్తుతం బెల్లంపల్లి, కాసిపేటలో తప్పా మిగతా మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు లేవు.

సాగునీటి వనరులు అంతంత మాత్రమే....

అసెంబ్లీ నియోజకవర్గంలో నీల్వాయి ప్రాజెక్టు మినహా మరే ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం జరగలేదు. కాసిపేట ,భీమిని , నెన్నెల , తాండూర్ ,కన్నెపల్లి మండలాల్లో చిన్ననీటి పారుదల సౌకర్యాలు ఉండగా కాలువలకు మరమ్మతులు చేపట్టక ఆయకట్టు చివరి భూములకు సాగునీరందని పరిస్థితి. ఈసారి ఎన్నికయ్యే ప్రజాప్రతినిధులైనా చిత్తశుద్ధితో వ్యవహరించి సమస్యలు తీర్చాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

'ఎన్నికల్లో చిన్నయ్యకు బుద్ధిచెప్పాలి'


మాట్లాడుతున్న శెజల్

శ్రీరాంపూర్(మంచిర్యాల): మహిళలంటే గౌరవం లేని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఆరిజన్ డెయిరీ సీఏఓ బోడపాటి శెజల్ అన్నారు. గురువారం నస్పూర్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మహిళలను వేధిస్తున్న చిన్నయ్యకు బీ ఫాం ఇచ్చిన రోజే బీఆర్ఎస్ పతనం మొదలైందన్నారు. తనకు జరిగిన అన్యాయాన్ని బెల్లంపల్లిలో ప్రతీపల్లెకు, గడపగడపకు వెళ్లి ప్రజలకు చెప్పుకోవాలని చూస్తే చిన్నయ్య మనుషులతో ప్రాణభయం వల్లే నేడు మీడియాతో తన ఆవేదన చెప్పుకోవాల్సి వస్తోందన్నారు. చిన్నయ్యపై హైకోర్టులో పిటిషియన్ వేశానని, ఈ నెల 28న విచారణ ఉందన్నారు.

మద్యం పట్టివేత

గుడిహత్నూర్: మండలంలోని సీతాగొంది గ్రామంలో గురువారం ఎక్సైజ్‌శాఖ అధికారుల దాడుల్లో రూ.16800 విలువ గల మద్యం లభ్యమైంది. సమాచారం మేరకు నక్కరాజు అనే వ్యక్తి ఇంట్లో సోదాలు చేయగా 140 మద్యం సీసాలు దొరికాయని ఎక్సైజ్ సీఐ రాజమౌళి తెలిపారు. సీసాలను స్వాధీనం చేసుకొని నక్కరాజుపై కేసు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై లక్ష్మణ్ కుమార్, సిబ్బంది కార్తీక్ పాల్గొన్నారు.

పోలీసులపై బీఆర్ఎస్ నాయకుల దాడి

- 17 మందిపై కేసు నమోదు


విచారణ జరుపుతున్న సీఐ శ్రీనివాస్

భీమిని(బెల్లంపల్లి): విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై పలువురు దాడి చేసిన ఘటన కన్నెపల్లి మండలంలోని వీరాపూర్‌లో చోటు చేసుకుంది. తాండూర్ సీఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... వీరాపూర్ గ్రామానికి చెందిన ఎల్లాకుల మల్లేశ్ గత ఆదివారం అదే గ్రామానికి చెందిన సర్పంచ్ జిల్లెల అశోక్‌గౌడ్‌ను తిట్టాడు. దీంతో కోపం పెంచుకున్న అశోక్‌గౌడ్ కుమారుడు, బీఆర్ఎస్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జిల్లెల్ల మహేష్‌గౌడ్, కాసరపు శ్రీనివాస్‌తో కలిసి బుధవారం రాత్రి మల్లేశ్‌పై దాడి చేసేందుకు అతని ఇంటికి వెళ్లారు. మల్లేశ్ భార్య సత్తక్క వారిని నిలదీయడంతో ఆమెపై దాడి చేయడంతో గ్రామస్తులు 100కు సమాచారం అందించారు. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌రావు, కానిస్టేబుల్ తులసీరాం ఘటన స్థలానికి వెళ్లి గొడవలు పెట్టుకోవద్దని, అంతా వెళ్లిపోవాలని సర్దిచెప్పారు. వారు అక్కడి నుంచి వెళ్లకపోవడంతో వీడియో తీస్తుండగా సెల్‌ఫోన్ లాక్కుని అనుచరులతో కలిసి దాడి చేశారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రావు, కానిస్టేబుల్ తులసీరాం ఫిర్యాదు మేరకు సర్పంచ్, అతని కుమారుడితో పాటు మరో 15 మంది యువకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

సత్తక్క ఫిర్యాదుతో మరో కేసు

మల్లేశ్ భార్య సత్తక్క ఫిర్యాదు మేరకు మహేష్‌గౌడ్, కాసారపు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

'విద్యార్థులు, నిరుద్యోగుల మద్దతు కాంగ్రెస్‌కే'

పాతమంచిర్యాల: విద్యార్థులు, నిరుద్యోగుల మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉంటుందని విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ చిప్పకుర్తి శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు నివాసంలో విద్యార్థి సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ విద్యార్థులను, నిరుద్యోగులను మోసం చేసిందని, టీఎస్‌పీఎస్సీ ప్రశ్నా పత్రాలు లీక్ చేసి ఎంతో మంది నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమైందన్నారు. బీఆర్ఎస్ నియంత పాలనకు చెక్ పెట్టడానికే కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. సమావేశంలో విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్ జుమ్మిడి గోపాల్, కో కన్వీనర్ బచ్చలి ప్రవీణ్‌కుమార్, నాయకులు పూరెళ్ల నితీష్, శేఖర్, అభిరాం, రామగిరి రాంకుమార్, జిలకర సిద్ధార్థ, మురారి పాల్గొన్నారు.